క్లుప్తంగా

మంత్రికి ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గ్రామస్తులు

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్‌ మండలం పొట్లపల్లి సీతారాముల ఆలయంలో ఈనెల 17వ తేదీన జరిగే శ్రీరామ నవమి వేడుకలకు హాజరుకావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఏటా నవమి వేడుకల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తామన్నారు. మంత్రిని కలిసినవారిలో కానుగుల మోహన్‌, కర్ర రవీందర్‌రెడ్డి, గాలిపల్లి శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు



సీఎం రేవంత్‌రెడ్డితో జనగామ నియోజకవర్గ యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు కమలాకర్‌ యాదవ్‌

మద్దూరు(హుస్నాబాద్‌): సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో కలిసినట్లు జనగామ నియోజకవర్గ యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు కమలాకర్‌ యాదవ్‌ తెలిపారు. సీఎంను మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సీఎం సూచించారన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



గాగిళ్లాపూర్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్‌లో రెడ్డి, ముదిరాజ్‌ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మకు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలను ఊరేగింపు తీసుకెళ్లారు. ముందుగా అమ్మవారికి పూజలు చేశారు. బోనాలతో గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయురారోగ్యాలతో వుండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో రెడ్డి, ముదిరాజ్‌ సంఘాల నాయకులు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అవకాశవాద పార్టీలను ఓడించండి

మద్దూరు(హుస్నాబాద్‌): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మతోన్మాద, అవకాశవాద పార్టీలను ఓడించి ప్రజాసమస్యలపై పోరాడుతున్న సీపీఎం భువనగిరి పార్లమెంట్‌ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్‌ అన్నారు. ఆదివారం దూళ్మిట్ట మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలతో దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిందన్నారు. సీపీయం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు గొడ్డు బర్ల భాస్కర్‌, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

16న బహుమతల ప్రదానం

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): సిద్దిపేటకు చెందిన సుగుణ సాహితీ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది బాలల కథల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఈనెల 16న సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు నగదు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు సమితి కన్వీనర్‌ బైతి దుర్గయ్య ఆదివారం తెలిపారు. విజేతలకు జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌ రెడ్డి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. అనంతరం బాలల కథల సంపుటి 'నక్షత్రకోట' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. సిద్దిపేట అర్బన్‌ మండల విద్యాధికారి సత్తు యాదవరెడ్డి, జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి సయ్యద్‌ షౌకత్‌ అలీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు మర్రపడగ చెన్నకృష్ణారెడ్డి, బాల సాహితి వేత్త సంఘనభట్ల చిన రామకిష్టయ్య, కవులు, రచయితలు పర్కపెల్లి యాదగిరి, దాతారు సూర్యప్రకాష్‌, వేల్పుల రాజు, తదితరులు హాజరవుతారన్నారు.

అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణ

గజ్వేల్‌రూరల్‌: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో మార్య అంబేద్కర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆవిష్కరించారు.

స్వశక్తికి సర్కార్‌ అండ

- గ్రూపు సభ్యులకు రూ.10 లక్షల బీమా
- నాలుగు నెలల వడ్డీ రూ.12 కోట్లు విడుదల
- సంఘాలకు స్కూల్‌ పిల్లల యూనిఫాం కుట్టుపని అప్పగింత
- పాఠశాలల నిర్వహణకు అమ్మ ఆదర్శ కమిటీలు



పోతారం(ఎస్‌)లో యూనిఫాం కుడుతున్న మహిళలు

స్వయం ఉపాధి కల్పనతోపాటు పాఠశాలల అభివృద్ధిని నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం మహిళలకు అప్పగించింది. స్వశక్తి మహిళా సంఘాలకు రుణాలు అందజేసి వారిని ఆర్థిక శక్తిగా మలిచేందుకు చర్యలు చేపట్టింది. అంతే కాకుండా పాఠశాలలను నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే అవి అభివృద్ధి చెంది తద్వార గ్రామాల అభివృద్ధికి పునాదులు పడతాయని భావిస్తోంది. ఈసారి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫాం కుట్టు పని మహిళా సంఘాలకు అప్పగించడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హుస్నాబాద్‌రూరల్‌: గ్రామీణ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వారిని ఆర్థిక శక్తిగా మలిచేందుకు ప్రభుత్వ పూచీకత్తుపై స్వశక్తి సంఘాల మహిళలకు రుణాలు మంజూరు చేయించి వాటితో స్వయం ఉపాధి కల్పిస్తోంది. మహిళలకు ఇచ్చిన రుణాలకు వడ్డీ భారం పడకుండా ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2023 డిసెంబర్‌ నుంచి 2024 మార్చి వరకు జిల్లాలో 13,477 సంఘాలకు రూ.12.47 కోట్ల వడ్డీని ఇటీవల విడుదల చేసింది. వీటితో పాటు స్వశక్తి మహిళలకు రూ.10 లక్షల బీమా, రూ.2 లక్షల వరకు రుణబీమా భద్రత కల్పిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. బ్యాంకు రుణం తీసుకున్న గ్రూపు సభ్యురాలు మరణిస్తే ఆ రుణభారం ఇతర సభ్యులపై పడకుండా రూ.2 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించింది. రుణం తీసుకున్న సభ్యురాలు మరణించినా రుణం మాఫీ కావడం తోపాటు చెల్లించిన సొమ్మును తిరిగి పొందే అవకాశం ఉంటుంది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి 16,777 సంఘాలకు రూ.14.77 కోట్లు, 2022–23 ఆర్థిక సంవత్సరానికి 16,514 సంఘాలకు రూ.36.36 కోట్ల వడ్డీ రావల్సి ఉంది. కాగా గతంలో బకాయి ఉన్న వడ్డీని ప్రభుత్వం విడుదల చేస్తుందా లేదా అని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

స్కూల్‌ యూనిఫాం కుట్టుపని..

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫాం కుట్టుపని గతంలో ఏజెన్సీలకు అప్పగించేవారు. కొలతలు సరిగాలేక వాటిని ధరించిన విద్యార్థులు ఇబ్బందిపడేవారు. యూనిఫాం కుట్టుపని అప్పగించడం వల్ల మహిళలు ఉపాధి పొంది ఆర్థిక ప్రగతి సాధిస్తారని ప్రభుత్వం ఆలోచన. మొదట మండలంలోని కుట్టు శిక్షణ పొందిన టైలరింగ్‌ యూనిట్‌కు అప్పగించి, అక్కడి నుంచి పీసు వర్క్‌ను మహిళా సంఘాలకు సరఫరా చేయనున్నారు. కట్‌ మిషన్‌, మిషన్ల కొనుగోలు చేయడానికి సంఘాల నుంచి రుణ సౌకర్యం కల్పించనున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యా కమిటీలు వేసి అభివృద్ధి పనులు చేయించేవారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటుచేసి నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తోంది. ఇందులో గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు కమిటీ చైర్మన్‌గా పాఠశాల హెచ్‌ఎం కన్వీనర్‌గా, 6 నుంచి 9 వ తరగతి వరకు తరగతికి ముగ్గురు చొప్పున పిల్లల తల్లులను కమిటీ సభ్యులుగా తీసుకుంటారు. ఇప్పటికే కమిటీలు పూర్తి చేసి జాతీయ బ్యాంకులో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట ఖాతాలు తీయించారు. పాఠశాలల అభివృద్ధికి కలెక్టర్‌ నిధులు మంజూరు చేస్తే వాటిని రూ.25 వేల వరకు అభివృద్ధి పనుల నిర్ణయం తీసుకోనే అవకాశం ఈ కమిటీలకు అప్పగించారు. రూ.50 వేలు దాటుతే ఎంపీడీఓ, రూ.లక్ష దాటితే కలెక్టర్‌ అనుమతి తప్పనిసరి. పాఠశాలలో అభివృద్ధి పనులు చేయించే బాధ్యతలను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించడంతో పాఠశాలలు స్వచ్ఛతగా ఉంటాయని ఆశిస్తున్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికి పునాదులు



ప్రభుత్వ మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఆర్థిక ప్రగతి సాధించే అవకాశం ఉంటుంది. టైలరింగ్‌ చేయాలంటే జిల్లా నుంచి దుస్తులు తెచ్చి కుట్టేవాళ్లం. టెండర్‌ ద్వారా పని తెచ్చుకుంటే బిల్లులు సరిగా వచ్చేవి కావు. ఇప్పుడు ప్రభుత్వమే మహిళా సంఘాలకు యూనిఫాం కుట్టే పని అప్పగిస్తే అందరికీ పని దొరుకుతుంది. బ్యాంకు రుణాలను చెల్లించే అవకాశం ఉంటుంది. కుట్టు చార్జీ రూ.50 నుంచి రూ.100కు పెంచితే గిట్టుబాటు అవుతుంది.

– బోయిని కనకతార,సీఏ, పోతారం(ఎస్‌)

పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



ఇంటిని చక్క బెట్టే మహిళలకు పాఠశాలల నిర్వహణ బాధ్యతలను వారికే అప్పగిస్తే ఆదర్శంగా ఉంటాయని భావిస్తున్నాం. అభివృద్ధి పనుల్లో మహిళల భాగస్వామ్యం ఉంటే అవినీతి ఉండదు. పనులు కూడా మహిళలు దగ్గరుండి చేయిస్తారు. సమావేశాలకు హాజరు కావడం వల్ల పాఠశాలలో పిల్లల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంటుంది. మహిళా శక్తిని ప్రోత్సహిస్తే పల్లెల అభివృద్ధికి పునాదులు వేయడమే అవుతుంది. ఇప్పటికే బ్యాంకుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట ఖాతాలు తీశాం.

– బందారి మనీల, మండల నోడల్‌ అధికారి, హుస్నాబాద్‌

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్‌ మను చౌదరి

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): మండలంలోని శనిగరంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్‌ మను చౌదరి సందర్శించారు. కొనుగోలు కమిటీ సభ్యులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. రైతులకు అసౌకర్యం కలగకుండా త్వరగా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. ఆయన వెంట డీఆర్డీఓ జయదేవ్‌ ఆర్య, మార్కెటింగ్‌ డీపీఎం కరుణాకర్‌ తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో అంబేడ్కర్‌ జయంతి



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ 133వ జయంతిని ఆదివారం కలెక్టరేట్‌ కార్యాలయంలో జిల్లా షెడ్యూల్‌ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌ రెడ్డి, సిబ్బంది అంబేడ్కర్‌ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్‌ అధికారి కవిత, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పుల్లూరులో 1994-95 బ్యాచ్‌ విద్యార్థులు



హుస్నాబాద్‌లో..



దుద్దెడలో..

సిద్దిపేటరూరల్‌: పుల్లూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1994–95 బ్యాచ్‌ విద్యార్థులు పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. చిన్ననాటి మిత్రులు ఒక్కచోట చేరడంతో సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పరస్పరం యోగ క్షేమాలు తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కనకరాజు, సత్యం, బాల్‌ రెడ్డి, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌: హుస్నాబాద్‌ ఆదర్శ ఉన్నత పాఠశాల 2003–04 బ్యాచ్‌ టెన్త్‌ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు కలుసుకోవడంతో సందడి చేశారు. ఉన్నత స్థానాల్లో ఉన్న తమ విద్యార్థులను చూసి నాటి గురువులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేమిడి మల్లారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్‌): మండలంలోని దుద్దెడ హైస్కూల్లో 1999–2000 బ్యాచ్‌ టెన్త్‌ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడారు. బతుకు దెరువు కోసం వివిధ ప్రాంతాల్లో స్థిరపడి మళ్లీ ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే హక్కు లేదు

జిల్లా కాంగ్రెస్‌ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి



మాట్లాడుతున్న మహిళా కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి

దుబ్బాక: సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు కత్తి కార్తీకకు లేదని కాంగ్రెస్‌ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పూటకో పార్టీ మారుతూ సీఎం, కాంగ్రెస్‌పై మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. కత్తి కార్తీక అసలు ఏ నియోజకవర్గానికి చెందినదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. 2020 దుబ్బాక ఉప ఎన్నికల్లో పోటీచేస్తే కేవలం 600 ఓట్లు వచ్చాయన్నారు. సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్‌ సనా, సరోజన, లక్ష్మి, మహిళా నాయకులు తదితరులు ఉన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్‌

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ కులసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. రాజ్యాంగం రూపొందించేందుకు ఆయన చేసిన కృషి వెలకట్టలేమన్నారు. దళితులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారన్నారు. యువత ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలని సూచించారు.



సిద్దిపేటలో నిర్వహించిన మహాపాదయాత్రలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు



చిన్నకోడూరులో కేక్‌ కట్‌ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ రోజాశర్మ



హుస్నాబాద్‌లో నివాళులర్పిస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి



దుబ్బాకలో అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గన్నె వనిత



సిద్దిపేటలో సిద్దిపేట ఏసీపీ మధు, త్రీ టౌన్‌ సీఐ విద్యాసాగర్‌ తదితరులు..



తొగుటలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాదిగ

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



అమ్మవారికి పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతి

దుబ్బాకటౌన్‌: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తొగుట మండలం రాంపూర్‌ పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. దుబ్బాకలోని మహంకాళి దేవాలయంలో రెండు రోజులుగా కొనసాగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఎన్నిదానాలు చేసినా తల్లిదండ్రులు, గురువు, స్త్రీలను గౌరవించకుంటే ఫలితమివ్వవన్నారు. కార్యక్రమంలో పురోహితుడు వేలేటి జయరామ శర్మ, ఆలయ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రచనతో పేదలకు మేలు

గజ్వేల్‌రూరల్‌: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం రాజ్యాంగ రచన చేయడం వల్ల కొంతమేలు జరిగిందని, రాజ్యాధికారం కోసం బహుజనులు పాటుపడాలని సీనియర్‌ జర్నలిస్టు పాశం యాదగిరి పిలుపునిచ్చారు. ఏప్రిల్‌ 14 మహనీయుల మాసోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కొడకండ్లలో అంబేద్కర్‌ సంఘం అధ్యక్షుడు చంద ప్రవీణ్‌ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్‌ అధ్యక్షుడు పర్శరాములుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే చేసిన కృషితో బడుగు, బలహీన వర్గాలు చదువుకొనే అవకాశం లభించిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారిణి అరుణక్క, టీఎస్‌యూటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి వెంకట కిరణ్‌, ఎంపీటీసీ అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మున్సిపల్‌ యూత్‌ కాంగ్రెస్‌ ఉపాధ్యక్షుడిగా గోపి

దుబ్బాకటౌన్‌: దుబ్బాక మున్సిపల్‌ యూత్‌ కాంగ్రెస్‌ ఉపాధ్యక్షుడిగా దుబ్బాకకు చెందిన కడవెర్గు గోపి ఆదివారం నియమితులయ్యారు. ఈమేరకు దుబ్బాకలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌ రెడ్డి ఆయన నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూత్‌ కాంగ్రెస్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు శ్రీకాంత్‌, నాయకులు శ్రీనివాస్‌, రవి, భరత్‌, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేవైఎం మండల అధ్యక్షుడిగా నరేష్‌

తొగుట(దుబ్బాక): మండలంలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన బుర్ర నరేష్‌ గౌడ్‌ బీజేవైఎం మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయనకు బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం నియామకపత్రం ఆదివారం అందజేశారు. తన నియామకానికి సహకరించిన దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డిలకి కృతజ్ఞతలు తెలియ జేశారు.

◆ కాంగ్రెస్‌ విజయానికి కృషి చేయాలి

తొగుట(దుబ్బాక): పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తొగుట మండల బీఎస్పీ అధ్యక్షుడు జీడిపల్లి రాజు, లింగాపూర్‌ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. దుబ్బాకలోని పార్టీ కార్యాలయంలో వారికి కాంగ్రెస్‌ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్‌ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

◆ నేడు విద్యుత్‌ సరఫరా బంద్‌

గజ్వేల్‌రూరల్‌: మండల పరిధిలోని 33 కేవీ బీబీపూర్‌(లైన్‌) ఫీడర్‌ పరిధిలోని గ్రామాల్లో సోమవారం సాయంత్రం విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ మారుతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌ లైన్‌ మరమ్మతుల కారణంగా ధర్మారెడ్డిపల్లి, ఎల్కల్‌, బేగంపేట్‌, మజీద్‌పల్లి, బంగ్లావెంకటాపూర్‌, నెంటూర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ ఆపన్నహస్తం

గజ్వేల్‌రూరల్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి 'ఆపన్నహస్త మిత్ర బృందం' చేయూతనందించింది. గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ (ఏటిగడ్డ కిష్టాపూర్‌)కు చెందిన జయాల యాదగిరి ఇటీవల సంగాపూర్‌ ఎడ్యుకేషన్‌ హబ్‌ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తమ వద్ద ఉన్న రూ.40 లక్షలతోపాటు మరో రూ.20 లక్షలు అప్పుచేసి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు క్షతగాత్రుడికి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



నిరసన దీక్షలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌ రెడ్డి

హుస్నాబాద్‌: నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని, బీజేపీ ఎంపీలను గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మురికి కాలువలో వేసినట్లేనని బీజేపీ రాష్ట ఉపాధ్యక్షుడు మనోహర్‌ రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్‌ కరీంనగర్‌లో రెండు సార్లు బీజేపీ చేతిలో ఓటమిపాలై హుస్నాబాద్‌ వచ్చి అనుకోనివిధంగా ఎమ్మెల్యేగా, మంత్రి అయ్యాడన్నారు. ప్రజలు కోరుకున్న ప్రభుత్వం కాదని, బీఆర్‌ఎస్‌ పాలనకు వ్యతిరేకంగా ఎన్నుకున్నారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కోమటిరెడ్డి రాంగోపాల రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్‌ మెంబర్‌ లక్కిరెడ్డి తిరుమల, అసెంబ్లీ కన్వీనర్‌ లక్ష్మారెడ్డి, కో కన్వీనర్‌ వేణుగోపాల్‌ రావు, పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.